సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



మార్కెట్ కమిటీ పదవి కోసం మల్లగుల్లాలు

రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీలకు కేటాయించడంతో, ఆ రిజ్వరేషన్ మార్పుకోసం టీడీపీ ప్రయత్నాలు చేసినట్లుగా కూటమి వర్గాల్లో ప్రచారం నెలకొంది. -4లో



చెట్టును ఢీకొన్న మారుతీ వ్యాన్

వేగంగా వస్తున్న మారుతి వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరొకరు గాయపడ్డారు. మదనపల్లె మండలంలో ఈ సంఘటన జరిగింది. -4లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.100	రూ.120
రెండోరకం	రూ.60	రూ.90

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 219 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దెబ్బతిన్న అరటి పంట పరిశీలన



మాచుపల్లెలో అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి

సిద్దవటం: మండలం లోని మాచుపల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం వీచిన గాలులకు దెబ్బతిన్న అరటి పంటను శనివారం ఉద్యాన శాఖ అధికారి జయభరత్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాచుపల్లె గ్రామానికి చెందిన రైతు పైనేని సుబ్బరాయుడు 3 ఎకరాల్లో అరటి పంటను సాగుచేశారన్నారు. గాలులకు తోట దెబతిందని తెలిపారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులకు వైద్య శిబిరం

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో ఉపాధ్యాయులకు ఈ నెల 24 నుంచి 26 వరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని గవర్నమెంట్, జిల్లా పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలల అన్ని క్యాటగిరీల ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి వైద్య ధ్రువీకరణ పత్రాలు అనగా ప్రిఫరెన్షియల్ క్యాటగిరి స్పెషల్ పాయింట్లకు అర్హత కలిగిన వారు హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. హాస్పిటల్ వారు ఇచ్చిన సర్టిఫికెట్ మేరకు ప్రిఫరెన్షియల్, స్పెషల్ పాయింట్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు రిమ్స్‌లో వైద్య ధ్రువీకరణ పత్రాలు పొందడానికి తాజా మెడికల్ రిపోర్టులు తీసుకుని రావాలని వివరించారు.

బాధ్యతలు స్వీకరణ



హిదాయతుల్లా

కడప కోటిరెడ్డి సర్కిల్: ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా షేక్ హిదాయతుల్లా బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయన నియమితులయ్యారు. శనివారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరిని మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హిదాయతుల్లా మాట్లాడుతూ మహిళలు, యువత, విద్యార్థులు, వ్యాపారులు వంటి అన్ని మైనారిటీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న మైనారిటీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అర్హులైన వ్యక్తులకు చేరుస్తామని తెలిపారు. సంబంధీకులు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్‌లో ఉన్న తమ కార్యాలయాన్ని సంప్రదించాలని వివరించారు.

అడవిలో ఆగని వేట

- అడవి జంతువులే లక్ష్యంగా ఉచ్చులు వేస్తున్న వేటగాళ్లు
- ఇటీవల చిరుతతోపాటు అడవి పందుల మృత్యువాత
- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక జిల్లాలో విష సంస్కృతి
- అడవులపై వేటగాళ్లు పంజా విసురుతున్నా పట్టించుకోని అటవీశాఖ



సాక్షి రాయచోటి: జిల్లాలో ఆటవిక రాజ్యం కొనసాగుతోంది.కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత విష సంస్కృతికి బీజం పడింది. నాటు తుపాకులతో అడవులను చెరబట్టడం..వేట పేరుతో కొనసాగుతున్న దమనకాండతో వన్య మృగాలు ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదేమని అడిగే అధికారులు లేక, తాము చెప్పిందే వేదమన్నట్లు అడవుల్లో వేట కొనసాగిస్తున్నారు. పెద్ద జంతువులను వధించేందుకు వేటగాళ్లు వేస్తున్న ఉచ్చులు చిన్న జంతువుల ప్రాణాలు తీస్తున్నాయి. ఒక్కోసారి వేటగాళ్లు జంతువులపై ఎక్కుపెట్టిన గురి తప్పి పలువురు సామాన్యులు కూడా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకు గురి చేస్తోంది.

అమాయకుల బలి

జిల్లాలో లైసెన్స్‌డ్ తుపాకులు పక్కనపెడితే అడవిలో వేటాడటానికి అప్పట్లో తీసుకున్న తుపాకులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎందుకంటే వేట కోసం వెళుతున్న వేటగాళ్లు అదుపు తప్పో.. గురితప్పో.. జంతువులను కాల్చబోయి అమాయకుల ప్రాణాలు బలిగొంటున్నారు. ఇటీవల రాయచోటి సమీపంలోని మాధవరం వద్ద వేటగాళ్ల కాల్పుల్లో హనుమంతు అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. అంతే కాకుండా గుర్రంకొండ ప్రాంతంలో కూడా గతంలో అడవి జంతువులనుకుని కాల్చడంతో ఓ మహిళ ఇదే తరహాలో గాయపడి నెలరోజుల తర్వాత కోలుకుంది. అడవి పందుల కోసం వేసిన విద్యుత్ తీగలు తగులుకుని పలువురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. టెక్నాలజీ పెరిగిన ప్రస్తుత తరుణంలోనూ వేట పేరుతో జంతువులను తుద ముట్టడిస్తుండడం పట్ల పలువురు జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రణ ఏదీ..

జిల్లాలో వేటగాళ్లు అడవి జంతువులను పట్టడానికి ఉచ్చు బిగిస్తున్నారు. అవి వన్యప్రాణుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. నాలుగు రోజుల కిందట మదనపల్లె పరిధిలోని పొన్నేటిపాలెం వద్ద వేటగాళ్ల ఉచ్చుకు గర్భంతో ఉన్న చిరుత మృత్యువాత పడిన విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా చిరుత కావడంతో వ్యవహారం కాస్త బట్టబయలైంది. అటవీశాఖ అధికారులు ఉదయాన్నే అక్కడికి చేరుకున్నా చిరుతను సంరక్షించుకోలేకపోయారు. ఈ ఘటన ఓ ఉదాహరణ మాత్రమే. అధికారులకు తెలియకుండా జరుగుతున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. పంటలపై అడవి పందులు దాడి చేస్తున్నాయని వేస్తున్న విద్యుత్ తీగల కారణంగా పందులతోపాటు ఇతర జంతువులు నేలరాలుతున్నాయి. వేటగాళ్లు జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో వేటకు వెళుతున్నా నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు కూడా బలంగా ఉన్నాయి.



మదనపల్లె పరిధిలో ఇటీవల వేటగాళ్ల ఉచ్చులో చిక్కి మృతి చెందిన చిరుత (ఫైల్)

కొరవడుతున్న పర్యవేక్షణ

జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో అడవిలో అలజడి రేగుతోంది. ప్రధానంగా సుండుపల్లె, గువ్వలచెరువు, గంగనేరు, పెద్దమడ్యం, బి.కొత్తకోట, మదనపల్లె, పెద్దమడ్యం, రాజంపేట, చిట్వేలి, చిన్నమండెం తదితర ప్రాంతాల్లోని సమీపంలోగల అడవుల్లో వేట కొనసాగుతున్నట్లు తెలియవచ్చింది. ఏది ఏమైనా వేటగాళ్లపై అటవీశాఖ అధికారుల నిఘాలేకపోవడం, వారికి అవగాహన కల్పించకపోవడంతో విపత్కర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అమాయకులు బలి కాకుండా ఉండాలన్నా, పెద్ద జంతువులను వేటాడకుండా ఉండాలన్నా వేటగాళ్లల్లో మానసిక పరివర్తనలో మార్పు తీసుకొస్తే ప్రయోజనం ఉంటుందని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

దేవదాయ లీజులపై క్షేత్రస్థాయి పరిశీలన

- ఈవో మునిరాజుకు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట: 'దేవదాయ వేలం పాటలు పారదర్శకంగా జరిగేనా',(ఈనెల 10న), 'చెన్నకేశవా నీ భూములు గోవిందా'(నవంబర్ 26న) శుక్రవారం ప్రచురితమైన 'ఆలయంలోకి మురికినీరు'శీర్షికలతో సాక్షిలో ప్రచురితమైన కథనాలపై స్పందించిన దేవదాయశాఖ జిల్లా అధికారి విశ్వనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. స్థానిక గ్రామదేవత గంగమ్మ ఆలయానికి చెందిన వాణిజ్య గదులు, మాన్యం భూమిలో స్థలాల లీజుపై నిబంధనలు పాటించడం లేదని సాక్షిలో ప్రచురితమైన కథనంతో ప్రజలు ఈనెల 10న నిర్వహించిన వేలాన్ని బహిష్కరించిన విషయం తెలిసిందే. దీనిపై విశ్వనాథ్ ఇక్కడి సమస్యలను పరిశీలించారు. వాణిజ్య గదులను పరిశీలించాక మాన్యం భూమిలో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించుకుంటున్న వారిని తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు లేనిపక్షంలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆంజనేయస్వామి ఆలయ మాన్యం భూమిలో అనుమతి లేకుండా పెట్టుకున్న బంకులను తొలగించాలని నిర్వహకులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ మొహమ్మద్ అజారుద్దీన్‌ను కలిశారు. సాక్షిలో ప్రచురితమైన చెన్నకేశవా నీ భూములు గోవిందా శీర్షిక ప్రచురితమైన అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన భూములను వెంకటేశ్వరస్వామి ఆలయం పేరిట నమోదు చేశారని, దీన్ని మార్పు చేయాలని కోరగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. తర్వాత దిగువబస్టాండ్‌లోని పురాతన చెన్నకేశవ స్వామి ఆలయంలో చేరిన వర్షపునీటిని పరిశీలించారు. ఆలయం దిగువన ఉండటంతో పైనుంచి వర్షపునీళ్లు, మురికినీరు ఆలయంలోకి ప్రవహిస్తున్నట్టు గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనాలను పరిశీలించి వాటి పరిష్కారం కోసం బి.కొత్తకోటలో పర్యటించినట్టు చెప్పారు. గ్రామదేవత ఆలయ మాన్యం భూమిని వినియోగించుకుంటున్న వ్యక్తులను అక్కడినుంచి ఖాళీ చేయాలని ఆదేశించామన్నారు. వాణిజ్య గదుల విషయంలో ప్రస్తుతం ఉన్న లీజు విధానాన్ని మార్పు చేసి 11 ఏళ్ల లీజు ఇచ్చేలా, ప్రతిఏటా అద్దె పెంచేలా కమీషనర్‌కు ప్రతిపాదనలు పంపుతున్నట్టు చెప్పారు. మాన్యం భూమిలో వాణిజ్య అవసరాల కోసం వినియోగించుకునేలా వేలం నిర్వహించి స్థలాలను అప్పగిస్తామన్నారు. చెన్నకేశవ ఆలయం జీర్ణోద్ధరణ కోసం సాంకేతిక అధికారులను పంపి.. ప్రతిపాదనలు కమిషనర్‌కు నివేదించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని చెప్పారు. కాగా చెన్నకేశవస్వామి ఆలయానికి చెందిన మాన్యం భూముల్లో ఇసుకను అక్రమంగా తరలించకుంటున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఈవో మునిరాజుకు కమీషనర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు చెప్పారు. ఇందులో ఒక ఇంక్రిమెంటును ఎందుకు కట్ చేయకూడదో వివరణ ఇవ్వాలని నోటిసులో కమిషనర్ కోరినట్టు చెప్పారు.



ఆంజనేయస్వామి మాన్యంలో అక్రమణలు తొలగించాలని సూచిస్తున్న విశ్వనాథ్

రేపు జాబ్ మేళా



కడప కోటిరెడ్డి సర్కిల్: స్థానిక రిమ్స్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ప్రముఖ 18 కంపెనీలతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ చదివి 18 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. విద్యార్హత సర్టిఫికెట్లతోపాటు ఫొటోలు తీసుకుని రావాలన్నారు. ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపుపై అవగాహన

జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి: ఎలక్ట్రానిక్ వ్యర్థాల శాస్త్రీయ తొలగింపుపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, ఎస్‌హెచ్‌జీ గ్రూపుల ద్వారా ఈ వ్యర్థాల సేకరణ జరుగుతుందని స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి పట్టణంలోని ఏరియా ఆసుపత్రి వద్ద ఎలక్ట్రానిక్ వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించడం అనే కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన ర్యాలీలో కలెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వ్యర్థాల తొలగింపులో రెడ్యూస్, రీయూస్, రీసైకిల్ అనే ఆర్ఆర్ఆర్ సిద్ధాతాన్ని ప్రజలందరూ అవలంబించుకోవాలన్నారు. జిల్లాలోని 04 మున్సిపాల్టీలు, పెద్ద పంచాయతీల్లో ప్రతిరోజూ ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందన్నారు. మిగిలిన పంచాయతీలలో వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల రీసైక్లింగ్ ద్వారా ఆదాయాన్ని సంపాదించవచ్చన్నారు. రాయచోటి మున్సిపాల్టీ ఏర్పాటు చేసిన ఈ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రంలో నేడు 170 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించారన్నారు. వీటిని ప్రైవేటు కంపెనీలకు అందించి రీసైకిలింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్డీఓ శ్రీనివాస్, రాయచోటి మున్సిపల్ కమీషనర్ వాసు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ తదితరులు

ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తాం

మదనపల్లె సిటీ: జిల్లాలోని దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో ప్లాస్టిక్ నిషేదం అమలు చేస్తామని జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. శనివారం స్థానిక బెంగుళూరురోడ్డులోని శ్రీయోగభోగేశ్వరస్వామి ఆలయంలో ఉద్యోగులు, ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయాల్లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ కప్పులు నిషేధించాలని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఆలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ రమణ, దేవాదాయశాఖ ఇన్స్‌పెక్టర్ శశికుమార్, బాలఅంకన్న, వేదిపండితులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈఈ, ఏఈల బదిలీ

కడప సెవెన్‌రోడ్స్: నీటి పారుదల శాఖలో పని చేస్తున్న భారీగా ఏఈఈ, ఏఈలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ శనివారం ఆ శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాయలసీమకు చెందిన జోన్-4లోని జిల్లాలకు చెందిన గాలేరు-నగరి, హంద్రీ-నీవా, తెలుగుగంగ, ఎస్ఆర్‌బీసీ తదితర విభాగాల్లో పని చేస్తున్న ఇంజినీర్లను బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే పోస్టింగ్ ఇచ్చిన ప్రదేశానికి వెళ్లి రిపోర్టు చేసుకోవాలని ఈఎన్‌సీ ఆదేశించారు.

కవరు కట్టు.. లాభాలు పట్టు

- పెరుగుతున్న ఫ్రూట్ కవర్ల వినియోగం
- వంద శాతం నాణ్యత పెంచేందుకు అవకాశం
- మామిడి, దానిమ్మ, జామ, డ్రాగన్‌ఫ్రూట్స్‌కు అనుకూలం



రాయచోటి మండలంలో మామిడి కాయలకు తొడిగిన ఫ్రూట్ కవర్లు

రాయచోటి జగదాంబసెంటర్: పండ్లలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, తద్వారా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించే దిశగా ఉద్యాన శాఖ చర్యలు చేపట్టింది. జిల్లాలో మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్స్ తదితర పండ్ల తోటలు విస్తృతంగా సాగవుతున్నాయి. వీటిలో చెక్కగుజ్జుతో తయారైన పేపరు సంచులను వినియోగించడం ద్వారా నాణ్యమైన ఫలసాయం పొందే వీలుంది. పేపరు సంచులను కాయలకు గాలి చొరబడకుండా కడితే వంద శాతం నాణ్యతను పెంపొందించుకున్నట్లే. అన్నమయ్య జిల్లాలో మామిడి తోటలు దాదాపు 33 వేల హెక్టార్లలో సాగు కాగా.. వీటిలో దిగుబడి 30 నుంచి 40 శాతం మాత్రమే వచ్చాయి. ప్రస్తుతం మామిడి చెట్లు కాయలతో ఉన్నాయి. ఈ పేపరు సంచుల ద్వారా పండించిన పండ్లు విదేశాలకు ఎగుమతి చేసే నాణ్యతతో ఉంటాయని చెబుతున్నారు. గతేడాది అనేక మంది రైతులు ఫ్రూట్ కవర్లు వినియోగించి మామిడిలో నాణ్యత పెంచుకొని అధిక ధరలు పొందటం విశేషం.

అధిక ఉష్ణోగ్రతలతో రాలిన పూత, పిందె

గతంలో ఎప్పుడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు మామిడిపై తీవ్ర దుష్ప్రభావం చూపాయి. మొదట్లో పూత, పిందె బాగున్నా.. అధిక ఉష్ణోగ్రతలు మామిడి రైతుల ఆశలను రాల్చేశాయి. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఉష్ణోగ్రతలు దంచి కొడుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల రైతుల కళ్ల ముందే 60-70 శాతం పూత, పిందె రాలిపోయాయి. ఈ పరిస్థితుల్లో అంతంత మాత్రంగా ఉన్న దిగుబడులను కాపాడుకోవడంతోపాటు నాణ్యను పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇందుకోసం ఫ్రూట్ కవర్ల వినియోగం ఊరటనిచ్చింది.

ఏ పండ్లకు వాడవచ్చు..



- జామలో థైవాన్ గోవా పిందె ఏర్పడిన 20-25 రోజుల తర్వాత ఒక్కొక్క పిందెకు ఒక్కొక్క తెల్ల రంగు సంచి వాడాలి. 60 రోజు తర్వాత కాయలను కోయవచ్చు.
- దానిమ్మలో పిందె ఏర్పడ్డాక.. ఒక్కొక్క పిందెకు ఒక్కో తెల్లరంగు సంచి వాడాలి. 90 రోజుల తర్వాత కాయలను కోయాలి.
- ద్రాక్షలో గుత్తులు ఏర్పడిన 60 రోజుల తర్వాత ఒక్కో గుత్తికి ఒక్కో తెల్లరంగు సంచి వినియోగించాలి. 50 రోజుల తర్వాత గుత్తులను కోసుకోవాలి.

పురుగుల నుంచి రక్షణ: ఫ్రూట్ కవర్ వినియోగంతో మంగు, మచ్చలు, మంచు పురుగు, ముడ్డిపుచ్చు, టెంక పురుగు, మకరం, ఈగలు మొదలగు వాటిని నియంత్రించి నాణ్యమైన పండ్ల దిగుబడికి తోడ్పడుతుంది. పిందె దశలో అంటే నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో ఉన్నప్పుడు వాడాలి. మంచి పలక పిందెలను సంచిలో పెట్టి 3 సెంటీమీటర్ల పైన తొడిమకు, సంచికి ఉండే తీగను గాలి చొరబడకుండా కట్టాలి.

కాయలు తాజాగా ఉంటాయి



మామిడికాయలకు కవర్లు తొడగడం వల్ల తాజాగా ఉంటాయి. దానికితోడు ఎటువంటి రోగాలు కూడా దరి చేరవు. నాకు గల 5 ఎకరాల మామిడి తోటలో కొన్ని చోట్ల ఫ్రూట్ కవర్లను తొడిగాను. ఈ సారి అధిక ఉష్ణోగ్రతల వల్ల పూత, పిందె రాలిపోయాయి. దీంతో అంతంత మాత్రంగా ఉన్న దిగుబడులను కాపాడుకోవడానికి ఫ్రూట్ కవర్లు తోడ్పడుతాయనే ఆశ ఉంది.

– మండ్ల శివశ్రీనివాసులు, మామిడి రైతు, రాయచోటి మండలం

గిరాకీ బాగుంటుంది



మామిడి కాయలకు ఫ్రూట్ కవర్లు వేయడం వల్ల.. ఎటువంటి రోగాలు దరిచేరవు. ఇలాంటి పండ్లకు మార్కెట్లో అధిక ధరలు కూడా ఉన్నాయి. కొనుగోలుదారులు నేరుగా తోటల వద్దకు వచ్చి మామిడి కాయలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దానికితోడు ఇలాంటి పండ్లకు ధరలు కూడా బాగుంటాయని ఆశిస్తున్నా.

– ఎం.వీరపవన్‌మహేష్, రైతు, కుర్నూతల, లక్కిరెడ్డిపల్లె మండలం

చీడపీడలు దరి చేరవు



ఫ్రూట్ కవర్లను మామిడి సహా వివిధ పండ్ల సాగులో వినియోగించవచ్చు. వీటి వల్ల వంద శాతం నాణ్యత ఉంటుంది. గాలి చొరబడకుండా కడితే ఎలాంటి చీడపీడలు లేని ఆరోగ్యవంతమైన కాయలు పండించుకోవచ్చు. విదేశాలకు ఎగుమతి చేసే స్థాయిలో నాణ్యత ఉంటుంది. మామిడి, జామ, దానిమ్మ, డ్రాగన్ ఫ్రూట్ తదితరాలకు ఎంతో ఉపయోగం.

– వనితాబాయి, ఉద్యాన శాఖ అధికారిణి, రాయచోటి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్ర గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ టీచర్ తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మదనపల్లె పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ నారాయణ స్కూల్ సమీపంలో నివాసం ఉన్న రంగారెడ్డి భార్య ఆర్.హేమలత (56) కురబలకోట మండలం నందిరెడ్డిగారిపల్లె వద్ద ఉన్న ఓ పాఠశాలలో ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తున్నారు. శనివారం విధులకు హాజరయ్యేందుకు వెళ్లి నందిరెడ్డిగారిపల్లె వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వేగంగా వచ్చిన కారు ఢీకొంది. ప్రమాదంలో హేమలత తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా వైద్యశాలకు తీసుకెళ్లారు. ముదివేడు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఎనిమిది లీటర్ల సారా స్వాధీనం

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని వై.కోట అటవీ ప్రాంతంలో రైల్వేకోడూరు ఎక్సైజ్ సీఐ తులసి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి ఎనిమిది లీటర్ల సారాను స్వాధీనం చేసుకునానరు. వంద లీటర్ల ఊటను ధ్వంసం చేసి నిందితుడు కె.గంగయ్యను అరెస్టు చేశారు.

మార్కెట్ కమిటీ పదవి కోసం మల్లగుల్లాలు

- ఎస్టీకి చైర్మన్ పదవిపై పెదవి విరుపు
- రిజర్వేషన్ మార్పునకు టీడీపీ యత్నం
- చైర్మన్ పదవి కోసం పలువురు పోటీ



రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ

రాజంపేట : రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్టీలకు కేటాయించడంతో, ఆ రిజ్వరేషన్ మార్పుకోసం టీడీపీ ప్రయత్నాలు చేసినట్లుగా కూటమి వర్గాల్లో విస్తృత ప్రచారం నెలకొంది. ఎస్టీలకు మార్కెట్ కుర్చీ దక్కకూడదనే టీడీపీ కమ్మ నేతలు మోకాలడుతున్నారు. రాజంపేట, నందలూరు, పెనగలూరు మండల్లాలో ప్రొటోకాల్ కలిగిన స్థానికంగా ఏకైక పోస్టు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ. తొలిసారిగా మార్కెట్ కమిటీ నియామకాల్లో దళితవర్గానికి (ఎస్టీ)కి రావడంతో ఆ పోస్టును బీజేపీ ఆశిస్తోంది. అయితే ఆశించిన బీజేపీ ఎస్టీనేత మస్తానయ్య ఇటీవల ఆకస్మిక మరణం చెందారు.

స్నేహితుడు పోయాడు..

రాష్ట్ర మంత్రి సత్యకుమార్ తన స్నేహితుడు పోతురాజు మస్తానయ్యకు రాజంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోస్టు వచ్చేందుకు ప్రయత్నించారు. తనకు అవకాశం కల్పించాలని మంత్రి సత్యను మృతిచెందిన మస్తానయ్య స్వయంగా కలిసి కోరారు. దీంతో ఆయన అధిష్టానం దృష్టికి తీసుకెళదాం, ప్రయత్నం చేద్దామని భరోసా ఇచ్చారు. ఇప్పుడు ఆ మిత్రుడు మరణించిన నేపథ్యంలో ఆ స్థాయిలో ఎస్టీ నేత బీజేపీలో లేకపోవడ గమనార్హం.

చైర్మన్, వైస్‌చైర్మన్ మాకే కావాలంటున్న టీడీపీ

మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్ తమకే కావాలని టీడీపీ నేతలు ఊవ్విళ్లూరుతున్నారు. కూటమిలో నామినేటెడ్ పదవుల కేటాయింపులో తమకే అగ్రపీఠమనే భావనలో తమ్ముళ్లు ఉన్నారు. వర్గనేతలు సుగవాసి సుబ్రమణ్యం, చమర్తి జగన్‌మోహన్‌రాజు వర్గాలు మార్కెట్ కమిటీకి పోటీపడుతున్నారు. అధిష్టానానికి పలువురు కమ్మ సామాజికవర్గ నేతలు పేర్లు వెళ్లాయి. వీరి మధ్య పోటీ నెలకొనడంతో అధిష్టానం తలపట్టుకుంటోంది. చైర్మన్‌కు రిజర్వేషన్ మార్పని క్రమంలో వైస్ చైర్మన్ పోస్టును కమ్మ సామాజిక వర్గానికి ఇవ్వాలని పట్టుబడుతున్నారు.

వైస్‌చైర్మన్‌పై బలిజ నేతల కన్ను

తమ వల్లే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న భావనలో ఉన్న జనసేన నాయకుల్లో నియోజకవర్గంలో ఒక్క నామినేటెడ్ పోస్టు కూడా తమకు రాలేదనే ఆవేదనలో ఉన్నారు. అధికంగా ఈ పార్టీ బలిజ సామాజికవర్గం నుంచి పదవిని ఆశిస్తున్నారు. ఆ పార్టీ రాజంపేట నియోజకవర్గానికి ముఖ్యనేత, పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడు యల్లటూరు శ్రీనివాసరాజు వైస్‌చైర్మన్ పదవిని జనసేన పార్టీ కోసం పనిచేసిన నేతకు ఇప్పించాలనే అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఇప్పటికే రైల్వేకోడూరులో చైర్మన్ పదవి జనసేనకు ఇవ్వడంతో, రాజంపేటలో వైస్‌చైర్మన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు మార్కెట్ కమిటీ నియమాకం విషయంలో కూటమిలో మల్లగుల్లాలు పడుతుండటంతో అధిష్టానం నియామకం నిర్ణయాన్ని పెండింగ్‌లో పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది.

చెట్టును ఢీకొన్న మారుతీ వ్యాన్

- వ్యక్తి దుర్మరణం
- మరొకరి పరిస్థితి విషమం



ఆరీఫుల్లా(ఫైల్)







చెట్టును ఢీకొని తీవ్రంగా దెబ్బతిన్న మారుతి వ్యాన్, మృతిచెందిన ఆరీఫుల్లా, తీవ్ర గాయాలతో ముజాహిద్దీన్

మదనపల్లె/చిన్నమండెం : వేగంగా వస్తున్న మారుతి వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శనివారం మదనపల్లె మండలంలో ఈ సంఘటన జరిగింది. లక్కిరెడ్డిపల్లె మండలం, చింతకుంటవారిపల్లెకు చెందిన అల్లా బక్షు, జరీనా దంపతుల కుమారుడు ఆరీఫుల్లా (42) అప్పకొండయ్యగారిపల్లె ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గా పని చేసేవాడు. ఇటీవల తన ఉద్యోగానికి రాజీనామా చేసి, ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో చేరాడు. చిన్నమండెం మండలం మల్లూరులో ప్రస్తుతం ఉంటున్నాడు. చిన్న మండెంలో దొడ్ల మిల్క్ డైరీ షాప్ నిర్వహిస్తున్న మోదిన్ సాబ్ కుమారుడు ముజాహిద్దీన్ (35)తో కలసి మారుతి ఓమ్ని వ్యాన్‌లో వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు చిన్నమండెం వెళ్లేందుకు అదే వాహనంలో వాయల్పాడు, గుర్రంకొండ మీదుగా బయలుదేరారు. మార్గమధ్యంలోని మదనపల్లె – తిరుపతి రహదారిలో సీటీఎం గంగమ్మ గుడి ఆలయ సమీపంలో, ఆరీఫుల్లా వాహనాన్ని డ్రైవింగ్ చేస్తూ అదుపు చేయలేక రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్నాడు. ప్రమాదంలో ఆరీఫుల్లా తీవ్రంగా గాయపడి డ్రైవింగ్ సీట్ లోనే మృతి చెందాడు. పక్కనే ఉన్న ముజాహిద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. దాదాపు గంట సేపటి వరకు 108 వాహనం సంఘటన స్థలానికి రాకపోవడంతో క్షతగాత్రుని ఆసుపత్రికి తరలించడంలో ఆలస్యమైంది. మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి చేరుకున్న బాధితుడు ముజాహిద్దీన్‌కు అత్యవసర చికిత్స అందించిన అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు బెంగళూరుకు తీసుకువెళ్లారు. ప్రమాద సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దుర్మరణం చెందిన ఆరిఫుల్లా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతునికి భార్య ఆస్మా ముగ్గురు కుమారులు ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

చిరుత మృతిపై అటవీశాఖ వైఖరి సరికాదు



అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు, సీపీఎం నాయకులు

మదనపల్లె సిటీ : అటవీ భూముల్లో చిరుతపులి ఉచ్చులో చిక్కుకుని మరణించిన సంఘటనను అటవీ శాఖ అధికారులు మసిపూసి మారేడు కాయ చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక అటవీశాఖ కార్యాలయం ఎదుట పొన్నూటిపాలెం గ్రామ రైతులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక రైతులతో కలిసి నిరసన తెలిపారు. అడవి జంతులను వేటాడే వాళ్లతో అటవీ అధికారులకు సత్సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. గత పది నెలలుగా చిరుత సంచరిస్తోందని రైతులు చెప్పినా ఏమీ తెలియనట్లు అటవీశాఖ అధికారులు వ్యవహరించారన్నారు. చిరుత చనిపోయిన సంఘటనలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తున్నా ఒక్క అధికారిపై కూడా చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమానికి జనసేన రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పొన్నూటిపాలెం రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యులకు భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్

పీలేరు : ప్రభుత్వ వైద్యులపై దాడులు జరగకుండా ప్రభుత్వం భద్రత కల్పించాలని భారతీయ వైద్యుల సంఘం (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నందకిషోర్, కార్యదర్శి డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ సేవకుమార్ కోరారు. శనివారం పీలేరు ఏరియా ఆస్పత్రిని వారు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఆసుపత్రుల అనుమతులు, పాత ఆసుపత్రుల అనుమతుల రెన్యువల్ ప్రాసెస్ సులభతరం చేయాలని కోరారు. మిక్సోపతిని ప్రోత్సహించాలని, అల్లోపతి వైద్య విధానంలోకి మిగిలిన వైద్య విధానాలను కలపకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ చంద్రశేఖర్, పీలేరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ మమతా లక్ష్మి, కార్యదర్శి డాక్టర్ పవన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ ఈశ్వర సురేంద్ర, డాక్టర్ రాజాసాహెబ్, డాక్టర్ శ్రీనివాసగుప్తా, డాక్టర్ నాగవేణి, డాక్టర్ శివయ్య, డాక్టర్ రూపేష్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ హరి, డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, డాక్టర్ అలీమ్ పాల్గొన్నారు.

కువైట్‌లో ఆకేపాటి జన్మదిన వేడుకలు



ఆకేపాటి జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ కువైట్, గల్ఫ్ నేతలు

రాజంపేట : వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం కువైట్‌లో వైఎస్సార్‌సీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు లక్ష్మీప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో కువైట్ ఓమేరియా పార్కులో కేక్ కట్ చేశారు. వందమందికి భోజనాలనుఏర్పాటు చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కో-కన్వీనర్ గోవిందు నాగరాజు, రెడ్డి సంఘం కువైట్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ అడ్వయిజర్ కమిటీ సభ్యుడు నాయని మహేశ్వరరెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ షేక్ రహ్మతుల్లా, కో-కన్వీనర్ మర్రి కళ్యాణ్, సీనియర్ నేతలు రమణారెడ్డి, నరసింహ యాదవ్, సబ్దార్, లక్కీ అజీజ్, గజ్జల నర్సారెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆర్టీసీ కండక్టర్‌కు కలాం కార్మిక రత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆర్టీసీ కండక్టర్ సీఎస్ మణ్యం

రాజంపేట : ఏపీఎస్‌ఆర్‌టీ కండక్టర్ సీఎస్ మణ్యం కలాం కార్మికరత్న అవార్డును దక్కించుకున్నారు. ఇంటర్నేషనల్ యునైటిడ్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా తమిళనాడులోని మధురైలో జేపీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అయ్యప్పన్, శ్రీలంక ప్రభుత్వ యువజన సర్వీసుల కమిషనర్ తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు కండక్టర్ తెలిపారు.

అనారోగ్యంతో హోంగార్డు మృతి



హోంగార్డు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య నవ్యసుధ

సుండుపల్లె : మండలంలోని అగ్రహారంలో నివాసం ఉంటున్న గూటి శివకుమార్(36) అనే హోం గార్డు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతునికి భార్య నవ్యసుధ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రాజంపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి కార్యాలయంలో శివకుమార్ హోంగార్డు(498)గా విధులు నిర్వహించే వాడు. అనారోగ్యం కారణంగా గత కొద్ది రోజుల నుంచి సెలవులో ఉన్నాడు. హోంగార్డు శివకుమార్ మృతిపట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే సుండుపల్లె ఎస్ఐ శ్రీనివాసులు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అమరనాథరెడ్డి, రాజంపేట సబ్ డివిజన్ హోంగార్డు ఇన్‌చార్జి లక్ష్మీరెడ్డి, పోలీసు సిబ్బంది, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ కోడూరువాండ్లపల్లి గ్రామంలో స్వగృహంలో ఉన్న హోంగార్డు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

బేకరీని తనిఖీ చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు



రామసముద్రం బేకరీలో తినుబండారాలు పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

రామసముద్రం : రామసముద్రంలోని ఓ బేకరీని శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం హనీ కేక్ తిని ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురైన సంఘటన తెలిసిందే. ఈ మేరకు అన్నమయ్య జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీం బాషా తన సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. బేకరీలోని పలు రకాల తినుబండారాలను పరిశీలించారు. పదార్థాల తయారీకి సంబంధించి పరికరాలు, వస్తువుల నాణ్యతను తెలుసుకున్నారు. ఇందులో కొన్ని పదార్థాలను ల్యాబ్ పరిశీలన నిమిత్తం ఫుడ్ సేఫ్టీ అధికారులు తీసుకెళ్లారు.

పోలీసుల దాడిలో గాయపడిన వ్యక్తికి తీవ్ర అస్వస్థత

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : పెండ్లిమర్రి పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి ఎస్ఐ దాడి చేయడంతో నాగాయపల్లె గ్రామానికి చెందిన రామఓబుళరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. లాఠీ దెబ్బలు తిని గాయపడిన రామ ఓబుళరెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎక్స్‌రే తీయగా పక్కటెముకలు వాపు వచ్చి దెబ్బ తిన్నట్లు బాధితుడు తెలిపారు. రిమ్స్ అవుట్ పోస్టులో ఫిర్యాదు చేసిన కేసులో రాజీ ప్రయత్నాల కోసం ఎస్ఐ టీడీపీ మండల నాయకులను ఆశ్రయించాడు. టీడీపీ నాయకులు రంగంలోకి దిగి చెన్నూరులో రామఓబుళరెడ్డి బంధువు ఇంటికి వెళ్లి రాజీ ప్రయత్నాల కోసం మంతనాలు సాగించినట్లు విశ్వసనీయ సమాచారం.

మహిళపై దాడి



ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపమ్మ

మదనపల్లె : స్థలం వివాదం కారణంగా మహిళపై ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా దాడి చేసిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. మాలేపాడు పంచాయతీ కత్తోళ్ల ఊరు గ్రామానికి చెందిన గుర్రప్ప భార్య గోపమ్మ(45), తమ స్థలంలో పక్కింటి వారు రాళ్లు వేయడంతో వాటిని తీసివేయాల్సిందిగా కోరింది. అయితే ఈ విషయమై వివాదం చెలరేగి గోపమ్మపై అదే గ్రామానికి చెందిన కదిరప్ప, సరసమ్మ, భాస్కర కర్రలు, రాళ్లతో దాడి చేశారు. దాడిలో గోపమ్మ తీవ్రంగా గాయపడగా కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. దాడి ఘటనపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. సదరు వ్యక్తి ఏపీ 04 ఏఏ7640 నంబరు కలిగిన ద్విచక్ర వాహనంలో వెళుతుండగా కనుమలోపల్లె వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది . ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ సంఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని..



గాయపడిన దాసాను శ్రీనివాసరాజు

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి అప్పయ్యరాజుపేట పెట్రోల్ బంకు వద్ద శనివారం లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. చిన్నంపల్లి గ్రామానికి చెందిన దాసాను శ్రీనివాసరాజు (42) పుల్లంపేటకు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా అప్పారాజుపేట వద్దకు రాగానే వెనుక నుంచి లారీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరాజు ఎడమ కాలు పూర్తిగా విరిగిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని హుటాహుటిన క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పిచ్చయ్య తెలిపారు.

అక్రమంగా కొండను తవ్వేస్తున్నారు



ఆర్డీఓతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పశువుల మేత కోసం వదిలిన కొండ ప్రాంతాన్ని అక్రమంగా ఆక్రమించుకుని పూర్తిగా చదును చేస్తున్నారని , పైగా ఎలాంటి అనుమతులు లేకుండా సోలార్ కంపెనీ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆర్డీఓ ఆదిమూలపు సాయిశ్రీకి ఫిర్యాదు చేశారు. శనివారం పెద్దముడియం మండలంలోని కొండ పాపాయపల్లి, దిగువకల్వటాల గ్రామాలకు చెందిన రైతులతో కలిసి ఆర్డీఓను కలిశారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ కొండపాపాయపల్లి పంచాయతీ పరిధిలో నాగరెడ్డిపల్లె గ్రామంలోని సర్వే నంబర్ 224లో నంద్యాల, కడప జిల్లా ప్రాంతాలకు చెందిన రైతులు పశువులను మేపుకునేందుకు వస్తుంటారని తెలిపారు. రబీ, ఖరీఫ్ సీజన్‌లో ఈ ప్రాంతంలో పూర్తిగా పంటలు వేసుకుంటారన్నారు. పశువుల మేత కోసం అన్ని వర్గాల ప్రజలకు ఈ కొండనే ఆధారంగా నిలిచిందని చెప్పారు. అలాంటి కొండను సోలార్ కంపెనీ కోసం పూర్తిగా చదును చేస్తున్నారన్నారు. కల్వటాల గ్రామానికి చెందిన రైతుల పట్టా భూముల్లో రైతులకు ఎలాంటి సమాచారం లేకుండా పనులు చేసి వదిలేశారన్నారు. వారు వేసిన సిమెంట్ దిమ్మెలను తొలగించాలంటే రైతులకు లక్షల రూపాయలలో ఖర్చు అవుతుందన్నారు. వారికి న్యాయం జరిగే విధంగా అధికారులు సోలార్ కంపెనీ ద్వారా హామీ ఇప్పించాలని కోరారు. అధికారులు ఒకవైపు అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. అక్కడ పనులు మాత్రం వేగంగా జరుగుతున్నాయన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, కొండపాపాయపల్లె నాయకుడు వెంకటసుబ్బారెడ్డి, కల్వటాల నాయకుడు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం బీసీలకు చేసిందేమీ లేదు



రమేష్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ అన్నారు. శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర స్థాయి బీసీ విభాగం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ జిల్లా నుంచి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరామ్‌తోపాటు పలువురు బీసీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ విభాగాన్ని ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలి, పార్టీని ఎలా పటిష్టం చేయాలనే అంశాలపై బీసీ నేతలు దిశానిర్దేశం చేశారని, తదనుగుణంగా రాబోయే రోజుల్లో జిల్లా బీసీ విభాగం పనిచేస్తుందని తెలిపారు. త్వరలోనే జిల్లా, మండల కమిటీలు పూర్తి చేసి, కూటమి ప్రభుత్వంలో బీసీలకు జరిగే అన్యాయాలు, టీడీపీ వారు చేసే అక్రమాలను బయటపెడతామన్నారు.

వడ దెబ్బతో ఉపాధి కూలీలు మృతి

సింహాద్రిపురం : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో శనివారం వడదెబ్బతో ఇద్దరు ఉపాధి కూలీలు మృతి చెందారు. సింహాద్రిపురం మండలం నంద్యాలమ్మ బావి న్యూ ఫీడర్ ఛానల్ కాలువ పనులరే వెళ్లిన ఓబుళరెడ్డి దాహం వేయటంతో నీరు తాగి కూర్చొని ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఈ విషయాన్ని ఫీల్డ్ అసిస్టెంట్ భవాని ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుణాకర్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఉపాధి కూలీ మృతి చెందిన విషయం తెలుసుకున్న ఏపీఓ జయభారతి, ఈసీ శ్రీనివాసుల రెడ్డి, టీఏలు రజిత, లక్షుమయ్యలు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు.

అట్లూరు : మండల పరిధిలోని ముణ్యంవారిపల్లె పంచాయతీ పార్వతీపురంలో చాట్ల పోలయ్య (43) అనే ఉపాధి కూలీ శనివారం ఉదయం సమీపంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. అక్కడ తోటి కూలీలతో పనులు చేస్తూ మండే ఎండలకు తాళలేక ఉన్నపళంగా కుప్పకూలిపోయాడు. తోటి కూలీలు, స్థానికులు ఆసుపత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య భాగ్యమ్మ, కుమారుడు సంపత్, కుమార్తె శృతి ఉన్నారు.